సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఆక్వా లెక్క.. పక్కా..

ఆక్వా రైతులు సాగు ప్రారంభం నుంచి పట్టుబడి వరకు ప్రతి అంశం నమూనా పుస్తకాల్లో రాసుకోవాలని ఆక్వా నిపుణులు సూచిస్తున్నారు. 8లో ▸



వన్యప్రాణులను కాపాడుదాం

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహనకు ఏటా అక్టోబర్ 2 నుంచి 8 వరకూ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. 8లో ▸



సత్తా చాటిన లిఫ్టర్లు

ఏలూరు ఇండోర్ స్టేడియంలో అండర్–14 బాలికల అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా లిఫ్టర్లు సత్తా చాటారు. 8లో ▸

న్యూస్‌రీల్

1 నుంచి వీవోఏల ఆన్‌లైన్ సేవలు బంద్



భీమవరంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: వీవోఏలకు 5జీ సెల్‌ఫోన్లు ఇచ్చేవరకు వచ్చే నెల 1 నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిపివేస్తున్నట్టు వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ, సీఐటీయూ నాయకుడు ఎం.ఆంజనేయులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పీడీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు, రాయబారాలు నడిపినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిపివేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు.

కొల్లేరు పక్షుల వేటపై కలెక్టర్ ఆరా

సాక్షి స్పందన

కై కలూరు: అపురూపంగా చూసుకోవాల్సిన కొల్లేరు పక్షులపై 'విహంగాల స్వర్గంలో వేటగాళ్ల మరణ మృదంగం' శీర్షికతో పరిశోధనాత్మక కథనం 'సాక్షి'లో సోమవారం వెలువడిన విషయం పాఠకులకు విధితమే. దీంతో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ అటవీ అధికారులపై ఈ ఘటనపై చర్చించినట్లు తెలిసింది. దీంతో అటవీ అధికారులు కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. ఏలూరు వన్యప్రాణి యాజమాన్య ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పి.మోహిని విజయలక్ష్మి ఈ ఏడాది జూలైలో నిడమర్రు సెక్షన్ పరిధి వెంకట కృష్ణాపురం, ఏలూరు జిల్లా గుడివాకలంక గ్రామాల వద్ద పక్షుల వేటగాళ్లను పట్టుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. నిడమర్రు సెక్షన్ అడవి కొలనులో పక్షుల వేట జరగకుండా నిఘాను ముమ్మరం చేశామన్నారు. ఇదిలా ఉంటే కొల్లేరు పక్షుల వేటపై రాష్ట్ర అటవీ అధికారులు బృందంగా వాస్తవ పరిస్థితులు అంచనా వేయడానికి కొల్లేరుకు రానున్నారని సమాచారం.

అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపాలి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): ఫిర్యాదుదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోపు అర్జీలకు పరిష్కారం చూపాలని, రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, పీజీఆర్ఎస్ వై.దోసి రెడ్డి, డ్వామా పీడీ డా.కెసీహెచ్ అప్పారావు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని తెలిపారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యా లయం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత పోలీసు స్టేషన్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. అర్జీలు తిరిగి పునరావృతంగాకుండా పూర్తి స్థాయిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు.



సరస్వతీ దేవి అలంకరణలో మావుళ్లమ్మ



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో చిన్నారుల పూజలు



తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలో అక్షరాభ్యాసాలు



ద్వారకా తిరుమలలో సరస్వతీ దేవి అలంకారం

చదువుల తల్లీ కరుణించమ్మా..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి అనుగ్రహం పొందేందుకు తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు అట్టహాసంగా నిర్వహించారు. బాసర తర్వాత మేధా సరస్వతీ నిలయమైన ఈ పీఠానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆలయాల్లో అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్

సమ్మెలోకి పీహెచ్‌సీ వైద్యులు

- రూరల్ పీహెచ్‌సీల్లో సేవలకు దూరంగా వైద్యులు
- అత్యవసర సేవలు మినహా ఓపీ, వైద్య శిబిరాల బహిష్కరణ
- రోగుల ఇక్కట్లు, వైద్యుల అవతారమెత్తిన వైద్య సిబ్బంది



రుస్తుంబాదలో వైద్యులు లేకుండానే స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం

సాక్షి, భీమవరం: డిమాండ్ల సాధన కోసం రూరల్ పీహెచ్‌సీ వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. సోమవారం నుంచి అత్యవసర సేవలు మినహా ఓపీ, స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను బహిష్కరించారు. అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం వచ్చిన రోగులకు నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ప్రాథమికంగా మాత్రలు అందించారు. జిల్లాలోని 34 రూరల్ పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 74 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తగ్గించిన పీహెచ్‌సీ వైద్యుల పీజీ కోర్సుల కోటాను 20 శాతానికి పునరుద్ధరించాలని, టైం బాండ్ ప్రమోషన్స్ కల్పించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ. 5,000 అలవెన్స్ ఇవ్వాలని, కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఆరేళ్ల గడువును ఐదు సంవత్సరాలకు కుదించడం, నేటివిటీపై స్పష్టత కోరుతూ కొద్దిరోజులుగా పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉన్నతాధికారులకు నోటీసు అందజేశారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెలోకి వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం నుంచి ఆందోళన బాట పట్టారు.

వైద్య శిబిరాల బహిష్కరణ

మహిళల్లో అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. బీపీ, సుగర్, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. సమ్మెలో భాగంగా చాలాచోట్ల వైద్యులు శిబిరాలను బహిష్కరించారు. నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది శిబిరాలు వైద్యసేవలు అందించి మమ అనిపించారు. వైద్యులు లేకుండా వైద్య శిబిరాలేంటని నరసాపురం రూరల్ మోడీ గ్రామంలో శిబిరానికి వచ్చిన మహిళలు బహిరంగంగానే మాట్లాడుకున్నారు.



వైద్యుల సమ్మెతో ఎల్‌బీ చర్లలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది



మేడపాడు పీహెచ్‌సీలో విధులకు హాజరై ఓపీ సేవలకు దూరంగా వైద్యురాలు

సమస్యల పరిష్కారం కోసమే : ప్రజలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశ్యం కాదని, న్యాయమైన తమ డిమాండ్లు సాధించుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని ఏపీ పీహెచ్‌సీడీఏ నాయకులు అంటున్నారు. పీహెచ్‌సీ వైద్యుల పీజీ కోటా సీట్లను గత ఏడాది 30 శాతం నుంచి 20 శాతానికి తగ్గించిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది 15 శాతానికి తగ్గించినట్టు చెబుతున్నారు. సీహెచ్‌సీల్లో పనిచేసే సివిల్ అసిస్టెంట్ సర్జన్లు మూడు నాలుగేళ్లకే డిప్యూటీ సివిల్ సర్జన్స్‌గా పదోన్నతులు పొందుతుంటే తాము మాత్రం సీనియర్ మెడికల్ ఆఫీసర్లుగానే మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే అక్టోబరు 3 నుంచి విజయవాడలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు చెబుతున్నారు.

నిలిచిన వైద్యసేవలు

జిల్లాలో జిల్లా ఆరోగ్యకేంద్రం, మూడు సీహెచ్‌సీలు, ఐదు ఏరియా ఆస్పత్రులు, 34 పీహెచ్‌సీలు, 18 అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. రోజుకు దాదాపు 15 వేల వరకు ఓపీ నమోదవుతుంది. వీటిలో 40 శాతం వరకు రూరల్ పీహెచ్‌సీల్లోనే ఓపీ కేసులు ఉంటాయని అంచనా. రూరల్ పీహెచ్‌సీ వైద్యులు సోమవారం యథావిధిగా విధులకు హాజరైనప్పటికీ అత్యవసర సేవలు మినహా ఓపీ సేవలకు దూరంగా ఉన్నారు. అవుట్ పేషెంట్లుగా వైద్యం కోసం వచ్చిన గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొంతమంది నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోగా మరికొందరు అక్కడే ఉన్న ఏఎన్ఎంలతో సమస్య చెప్పుకుని వారిచ్చిన మందులు తీసుకెళ్లిన పరిస్థితి కనిపించింది. నరసాపురం నియోజకవర్గంలోని తూర్పుతాళ్లు, ఎల్‌బీ చర్ల, మొగల్తూరు, ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు పీహెచ్‌సీలు, భీమవరం రూరల్‌లోని గొల్లవానితిప్ప, తుందుర్రు, పాలకొల్లులోని యలమంచిలి, మేడపాడు, దొడ్డిపట్ల, అలాగే ఆచంట, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలోని రూరల్ పీహెచ్‌సీ వైద్యులు ఓపీ విధులను బహిష్కరించారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు ఓపీ సేవలు అందించారు. ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితులతో విషజ్వరాలు ప్రబలుతుండగా వైద్యుల సమ్మెతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

5న అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర బస్సు పట్టణం నుంచి అక్టోబర్ 5న తరలివెళ్తుందని, భక్తులు, ప్రయాణికులు విజయవంతం చేయాలని ఆర్టీసీ డీఎం పి.దానమ్మ పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుతూ 5న రాత్రి 7 గంటలకు యాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. 2+2 సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు 6న ఉదయం శ్రీకాళహస్తి, స్వామి దర్శనం, అనంతరం కాణిపాక విఘ్నేశ్వర స్వామి క్షేత్రం, దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్, అనంతరం 7న పౌర్ణమి రోజున రెండు గంటలకు అరుణాచలం చేరుకోవడం, గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం చేసుకుంటామని, అనంతరం 8న ఉదయం తాడేపల్లిగూడెం బస్సు చేరుతుందని చెప్పారు. అరుణాచల గిరి ప్రదక్షిణకు సంబంధించి ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని, చార్జీలు రూ. 2600లుగా నిర్ణయించారని తెలిపారు.

16 నెలల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా అప్పులు

పెనుగొండ: సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు చేయకుండానే కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో రూ.2 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని వైఎస్సార్‌సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. సోమవారం తూర్పుపాలెంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అమలు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అని గాలికొదిలేశారన్నారు. ఆడబిడ్డ నిధికీ నేటి వరకూ అతీగతీ లేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడికీ నేటి వరకూ ఒక్క సెంటు భూమి ఇవ్వలేదన్నారు. ఇల్లు మంజూరు చేయలేదన్నారు. గృహ నిర్మాణానికి ఒక్క రూపాయి ఇచ్చారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలకు కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతీ ఒక్కరికీ డిజిటల్ బుక్ శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. ఐవీఆర్ఎస్ నెంబర్ 040 49171718కు డయల్ చేసి నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, మండల కన్వీనర్లు గూడూరి దేవేంద్రుడు, జక్కంశెట్టి చంటి, పిల్లి నాగన్న, సర్పంచ్‌లు సుంకర సీతారాం, బుర్రా రవికుమార్, చిట్టు గుళ్ల పూర్ణిమ, కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, నాయకులు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆరోగ్యంతమైన మహిళ ద్వారా బలమైన కుటుంబం ఏర్పడుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో 'స్వస్థ నారీ–సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మహిళా ఉద్యోగినిల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యమంతమైన మహిళ ద్వారా బలమైన కుటుంబాలు ఏర్పడతాయని, ఆర్థిక అభివృద్ధితో పాటు, పిల్లలు కూడా మంచి విద్యను నేర్చుకోవడానికి తోడ్పడుతుందన్నారు. మహిళలు ఆరోగ్యానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తారని, పిల్లలు, భర్తకు పెట్టిన తర్వాత తల్లి త్యాగానికి, ప్రేమకి చిహ్నంగా మిగిలితే తినడం సర్వసాధారణమన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే మహిళలు కూడా సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం లేదని, ఇలాంటి చర్యల కారణంగా ఒకేసారి వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ అక్టోబర్ 1న చేపట్టనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెప్టెంబర్ 30న పండుగ కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల మొత్తాలను బ్యాంకుల నుంచి డ్రా చేశామన్నారు. జిల్లాలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై జీఎస్టీ ఛాంపియన్స్ ద్వారా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మొదటి వారం ప్రచారంలో 'గృహ పాదుపు' కార్యక్రమాన్ని సోమవారం భీమవరం 32వ వార్డు ఎడ్వర్డ్ ట్యాంక్ మీటింగ్ హాలులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జీఎస్టీ తగ్గిన వస్తువుల ప్రదర్శనను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సీహెచ్‌సీలో శిశువు మృతి

పురుడు పోసిన నర్సు

ఆకివీడు: ప్రసవించిన కొన్ని నిమిషాలకే ఆడ శిశువు మృతి చెందిన సంఘటన పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో సోమవారం ఉదయం జరిగింది. స్థానిక సమతానగర్‌లో చేపల చెరువులపై కాపలా ఉంటున్న ఏనుగుపల్లి పోలు, శ్రావణిలకు మూడో కాన్పులో ఆడ శిశువు జన్మించింది. జన్మించిన 20 నిమిషాలకే మృతి చెందిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదిలక్ష్మి చెప్పారు. శిశువు మెడకు మూడు మెలికలతో ప్రేగు ఉండటం వల్ల చనిపోయి ఉంటుందని ఆమె వివరించారు. ప్రసవ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, స్టాఫ్ నర్సు వైద్యం అందించారు. శిశువు మృతి వైద్యుల నిర్లక్ష్యమేనని, డ్యూటీ వైద్యులు లేకపోవడం వల్ల స్టాఫ్‌నర్సు పురుడు పోయడం దారుణమని సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు ఆరోపించారు.



మృత శిశువుతో బంధువు

దోపిడీ దొంగలున్నారు జాగ్రత్త !

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో రాబరీ గ్యాంగ్ సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్ మన ప్రాంతంలో సంచరిస్తున్నట్లు నమ్మకమైన సమాచారం అందిందన్నారు. ఈ గ్యాంగ్ ఇప్పటికే పలు చోట్ల రాత్రి సమయాల్లో నేరాలకు పాల్పడిందన్నారు. వీరు తక్కువ రేటు ఉన్న లాడ్జిలలో గానీ, ధాబాలలో గానీ తలదాచుకుంటారని తెలిపారు. ఎక్కడైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలు, డబ్బులు బ్యాంకులో దాచుకోవాలన్నారు. ముఖ్యంగా హైవేకు చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రిపూట అపరిచిత వ్యక్తులు తలుపు కొడితే తీయకూడదని సూచించారు.

సాగని దారిలో ఆగిన గుండె!

పోలవరం నిర్వాసితుల కష్టాలు

వేలేరుపాడు: ఆ గ్రామాన్ని గోదావరి వరద చుట్టుముట్టింది.. ప్రభుత్వం కనీసం బోట్ కూడా ఏర్పాటు చేయలేదు. ప్రాణాలు దక్కించుకునేందుకు అష్టకష్టాలు పడినా.. ఆ కుటుంబానికి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చివరికి గుండెకోతే మిగిలింది. వేలేరుపాడు మండలంలోని తిర్లాపురానికి చెందిన కాకాని వెంకటేశ్వర్లు (41) ఆదివారం మధ్యాహ్నం గుండెనొప్పి రావడంతో ఇంట్లోనే సొమ్మసిల్లి పడిపోయాడు. వైద్యం నిమిత్తం వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నా ఆ ఊరిని గోదావరి వరద చుట్టుముట్టింది. బంధువులు గోదావరి వరదలో ప్రాణాలకు తెగించి, థర్మాకోల్ షీట్‌పై పడుకోబెట్టి వరద దాటించి, కన్నాయిగుట్ట వరకు చేరుకున్నారు. కన్నాయిగుట్టకు వెళ్లాక అంబులెన్స్ కోసం అరగంట సేపు వేచి చూశారు. అంబులెన్స్ రాకపోవడంతో ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకొని ఐదు కిలోమీటర్ల దూరంలోని బుర్రతోగు వరకు వెళ్లారు. అక్కడికి అంబులెన్స్ రావడంతో వేలేరుపాడు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంకటేశ్వర్లు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మేళ్ళవాగు వంతెన గోదావరి వరద నీటిలో మునగడం వల్ల చాగరపల్లి, బుర్రతోగు, భూదేవిపేట మీదుగా ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంది. అధికారులు కనీసం ఒక బోట్ కూడా ఏర్పాటు చేయకపోవడం వల్ల వైద్యం అందకనిండు ప్రాణం పోయింది.



వరదలో థర్మాకోల్ షీట్‌పై వెంకటేశ్వర్లుని తరలిస్తున్న దృశ్యాలు, మృతుడు కాకాని వెంకటేశ్వర్లు (ఫైల్)

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇద్దరికి గాయాలు

భీమవరం: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా ఇరువురు గాయపడ్డారని భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ సోమవారం చెప్పారు. వివరాల ప్రకారం విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం మామిడివలసకు చెందిన కంచర్ల చిన్నారి(29) భర్తతో విభేదాలు కారణంగా కొంతకాలంగా ఉండి కాపులపేటలో నివాసముంటుంది. ఈనెల 28న కుమారుడు సత్యనారాయణ, మరొక వ్యక్తి వినయ్‌తో కలసి పేరుపాలెం బీచ్‌కు వెళ్లి మోటారుసైకిల్‌పై తిరిగి వస్తుండగా గొల్లవాని తిప్పరోడ్డులో మోటారుసైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో చిన్నారి తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ, వినయ్ తీవ్రంగా గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి తల్లి ఆకుల కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

భారీ వృక్షం మీద పడి యువకుడి మృతి

పాలకోడేరు: భారీ వృక్షం మీద పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామానికి చెందిన ఉల్లంపర్తి నరేష్(28) భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. సోమవారం తన స్నేహితునితో కలసి మోటార్‌సైకిల్‌పై స్వగ్రామం వస్తుండగా పాలకోడేరు మండలం వేంద్ర డెల్టా పేపర్ మిల్లు సమీపంలో అకస్మాత్తుగా భారీ వృక్షం వారిపై పడింది. స్థానికులు సమాచారంతో 108 అత్యవసర వాహనంలో క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్ర గాయాలైన నరేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి వర్మ తెలిపారు.

రోడ్డుపై వెళుతున్న కారులో మంటలు



కారులో మంటలు వస్తున్న దృశ్యం

భీమవరం: రోడ్డుపై వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కలకలం రేగింది. సోమవారం పట్టణానికి చెందిన న్యాయవాది ఎం శివప్రసాద్ తన కారులో ప్రయాణిస్తుండగా భీమవరం పట్టణం హెడ్‌వర్ట్‌ట్యాంక్ సమీపంలో కారులో శబ్దం వచ్చి ఒక్కసారిగా పొగ, మంటలు చెలరేగాయి. దీంతో శివప్రసాద్ వెంటనే కారును నిలుపుదల చేసి బయటకు వచ్చేశారు. తరువాత మంటలు మరింత పెరగడంతో అగ్నిమాపకశాఖకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు.

1, 2 తేదీల్లో మహాత్ముని జయంతోత్సవాలు

భీమవరం: మహాత్మాగాంధీ జయంతోత్సవాలను గాంధీస్మారక నిధి, సర్వోదయమండలి ఆధ్వర్యంలో అక్టోబర్ 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 1వ తేదీన భీమవరం గాంధీకస్తూరిబా భవనంలో గాంధీజీ జీవితాంశాల ఫొటో ఎగ్జిబిషన్, యువతకు అవగాహన కార్యక్రమం, 2వ తేదీన ఏలూరు జిల్లా పెదనింద్రకొలను గ్రామంలోని గాంధీభవనంలో గాంధీజీకి నివాళులు, సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రతిజ్ఞలు, గాంధీతత్వం చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం, గాంధేయవాదులకు పురస్కారాలు, తూర్పుగోదావరి జిల్లాలోని మల్లవరంలో శాంతిర్యాలీ, గాంధేయవాదులకు, సేవాతత్పరులకు గాంధీస్మారక పురస్కారాలు అందిస్తామని ప్రసాదరాజు తెలిపారు.

వన్యప్రాణులను కాపాడుదాం

- అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు
- వన్యపాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన



ట్రాప్ కెమెరాకు చిక్కిన గొర్ర గేదెలు



అడవి పందులు



కొండగొర్రెలు



పాపికొండల్లో సంచరిస్తున్న పులి



ముళ్ల పందులు



చిరుత పులులు



అడవిలో సంచరిస్తున్న ఎలుగుబంటి

బుట్టాయగూడెం: వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా వేటగాళ్ల స్వార్థానికి బలవుతూనే ఉన్నాయి. ఏటా ప్రపంచ జనాభా పెరుగుతుండగా వణ్యప్రాణుల సంఖ్య మాత్రం తగ్గుతోంది. కొన్ని జాతులు పూర్తిగా కనుమరుగవ్వగా మరికొన్ని అంతరించి పోయే దశకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ప్రతి ఏటా అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకూ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

1.12 లక్షల హెక్టారుల్లో అభయారణ్యం

1,12,500 హెక్టార్లలో పాపికొండల అభయారణ్యం విస్తరించి ఉంది. దీనిలో ఎక్కువశాతం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. వైల్డ్‌లైఫ్ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జంతువుల కదలికలను గుర్తించి వాటి సంరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పాపికొండల అభయారణ్యంలో ఎలుగు బంట్లు, కొండగొర్రెలు, జింకలు, కొండచిలువలు, అడవి పందులు, అడవి దున్నలు, ఆగలి, గెద్దలు, నెమళ్లు, చిరుతలు, కురుదు పందులు, చుక్కల దుప్పిలు, సామబాలు, ముళ్ల పందులు, జాకర్స్, ముంగీసలు, అడవి దున్నలు వంటివి ఉన్నాయి.

ప్రత్యేక బృందాలతో నిఘా

2018, 2022లో వైల్డ్‌లైఫ్ అధికారులు జంతుగణన నిర్వహించారు. పాపికొండల అభయారణ్యంలోని సుమారు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి సర్వేలను నిర్వహించారు. ఈ సర్వేల్లో ఏనుగులు, సింహాలు తప్ప అన్ని రకాల జంతువులు, పక్షులు, ఉభయచర జీవులను గుర్తించారు. జంతువుల సంరక్షణకు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక గస్తీ నిర్వహించడంతోపాటు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

వన్యప్రాణి చట్టం, శిక్షలు

- వన్యప్రాణుల సంరక్షణ కోసం సుమారు 48 ఏళ్ల క్రితం వైల్డ్‌లైఫ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం అడవుల్లో తిరిగే పక్షులు, జంతువులను వేటాడితే వన్య మృగాల సంరక్షణ చట్టం 1972 ప్రకారం శిక్షార్హులు.
- పులిని చంపి దాని చర్మాన్ని, గోళ్లు తీసినా, బంధించినా, విష ప్రయోగం చేసినా, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించినా చట్టంలోని సెక్షన్ 51(ఏ) కింద జైలు శిక్షతోపాటు, జరిమానా విధిస్తారు. చిరుతపులికి ఇదే సెక్షన్ వర్తిస్తుంది.
- ఎలుగు బంటిని చంపితే సెక్షన్ 68 (ఏ) మొసళ్లు, కోతులను పట్టుకున్నా, చంపినా సెక్షన్లు 428, 429 కింద కేసులు నమోదు చేస్తారు.
- కుందేళ్లను పట్టుకుంటే సెక్షన్ 148 (సీ), 135 (బీ)కింద కేసులు నమోదు చేసి శిక్ష విధిస్తారు.
- నెమలిని పట్టుకున్నా, హింసించినా సెక్షన్ 9 కింద శిక్షార్హులు. మిగతా జంతువులు, పక్షులకు సంబంధించి కూడా ఆయా సెక్షన్ల ప్రకారం చర్యలు తప్పవంటున్నారు. ఆయా జంతువులు, పక్షుల వేటలో కేసులు నమోదైతే బెయిల్ కూడా లభించదని జంతు సంరక్షణ అధికారులు హెచ్చరిస్తున్నారు.

జంతు సంరక్షణకు ప్రత్యేక చర్యలు



అటవీ ప్రాంతంలోని జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. బేస్‌క్యాంప్‌తో పాటు ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఏర్పాటు చేశాం. జంతువులను వేటాడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలుకు పంపిస్తున్నాం. అలాగే వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చే విధంగా నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నాం. చెక్‌డ్యామ్‌లు, ర్యాపిడ్ ఫీల్డ్ డ్యామ్‌లను నిర్మిస్తున్నాం. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకూ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించి జంతు సంరక్షణపై ప్రజలకు అవగాహన కలిగిస్తాం.

– ఎస్‌కె వల్లి ఫారెస్టు రేంజ్ అధికారి, పోలవరం

స్తంభాలకు అల్లుకున్న తీగల తొలగింపు



విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న తుప్పల తీగలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న తుప్పల తీగలను తొలగించారు. కొయ్యలగూడెం – బయ్యనగూడెం గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలకు వివిధ రకాల తీగలు అల్లుకున్నాయని, దీంతో తరచూ విద్యుత్ సరఫరా ట్రిప్ అయ్యి సాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోందని ఈనెల 25వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభానికి అల్లుకుని ఉన్న తుప్పల తీగలను తొలగించారు. డీఈ పీర్ అహ్మద్ ఆదేశాల మేరకు జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న తీగలను తొలగించి క్రమబద్ధీకరించినట్లు విద్యుత్ శాఖ అధికారి ఎస్‌వీ రామారావు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ జిలాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో లింగారాయుడిగూడెం గ్రామ వాసి రామలక్ష్మికి నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన వీరమళ్ళ అంజిబాబుకు 2012లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు లాంఛనాలు అందజేశారు. కొంతకాలం కాపురం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా ఇటీవల అదనపు కట్నం కోసం భర్త, అత్త, మరిది, పెద్ద అత్త వేధిస్తుండటంతో బాధితురాలు సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆక్వా సాగులో అప్సడా రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ఆక్వా రంగానికి అందించిన పరికరాల జీఎస్టీ సబ్సిడీ పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే కామినేని తదితరులు

కై కలూరు: ఆక్వా సాగులో విద్యుత్ యూనిట్ రూ.1.50 సబ్సిడీ పొందాలంటే ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ అథారిటీ(అప్సడా) రిజిస్ట్రేషన్ పొందాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కై కలూరు సీతారామ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ ఆక్వా రైతులు, ఫిషరీష్, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కై కలూరు నియోజకవర్గంలో మొత్తం 84,775 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతుందని, ఇందులో కేవలం 15 వేల ఎకరాల్లో మాత్రమే అప్సడాలో రిజిస్టర్ చేసుకున్నారన్నారు. అక్టోబరు 18లోపు అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆక్వా సంబంధిత వస్తువులకు జీఎస్టీ తగ్గించిందన్నారు. విద్యుత్ రాయితీపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఏలూరు ఆర్డీవో అచ్చుల అంబరీష్ మాట్లాడుతూ ఆక్వా రైతు చెరువులో పట్టా భూమితో పాటు కొంత పొరంబోకు భూమి ఉంటే కల్టివేషన్ సర్టిఫికేట్(సీటీసీ) కింద ఏడాది పాటు సాగు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతి ఏటా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. మత్స్యశాఖ జేడీ లాల్ మహ్మద్ మాట్లాడుతూ పాత మీ సేవ అనుమతులు కలిగిన చెరువులకు ఆక్వా, నాన్ ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా ఎండార్స్‌మెంట్ చేస్తారన్నారు. ఫోన్ లింక్ కలిగిన ఆధార్ కార్డు, పట్టాదారు జిరాక్స్, పన్ను కట్టిన రశీదుతో పాటు ఎకరానికి రూ.1000 ఫోన్‌పే, గూగుల్ పేలో మాత్రమే చెల్లించాలన్నారు. ఈ మత్స్యకార్ వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 8,513 ఉండగా సబ్సిడీకి అర్హత లేని రైతులు 1,628 మంది ఉన్నారన్నారు. వీరందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గప్రసాద్, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, వీరమల్లు నరసింహారావు, త్రినాథరాజు, జోగిరాజు, అంద్రాజు శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ డీడీ నరసయ్య, కైకలూరు ఏడీ రవికుమార్, రైతు నాయకుడు ముదునూరి సీతారామరాజు, భాస్కరరాజు, తహసీల్దారు, ఎంపీడీవోలు, విద్యుత్‌శాఖ ఏఈలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా లిఫ్టర్లు

టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా పశ్చిమ, రన్నర్‌గా గుంటూరు



పోటీల్లో పాల్గొన్న లిఫ్టర్లు

ఏలూరు రూరల్: ఏలూరు ఇండోర్‌స్టేడియంలో సోమవారం అండర్–14 బాలికల అంతర జిల్లాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లిఫ్టర్లు పెద్ద సంఖ్యలో పతకాలు సొంతం చేసుకుని, టీమ్ చాంపియన్‌షిప్ సాధించారు. గుంటూరు జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. పోటీల్లో ప్రతిభ చాటిన కడప లిఫ్టర్ జి లెనిన్‌ప్రియను నిర్వాహకుల బెస్ట్ లిఫ్టర్‌గా ప్రకటించారు. మొదట జరిగిన 40 కేజీల శరీర బరువు విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా లిఫ్టర్లు పి జ్ఞానపద్మావతి ప్రథమ స్థానం, ఏ రిషిత ద్వితీయ స్థానం, అనకాపల్లికి చెందిన కె కావ్య తృతీయ స్థానం సాధించారు. ఇదే క్రమంలో 44 కేజీల విభాగంలో జిల్లా లిఫ్టర్లు పి లేఖ్యశ్రీ, ఏ దర్శిక ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 53 కేజీల విభాగంలో ఎస్ అన్విత ద్వితీయ స్థానంలో నిలిచింది. 69 కేజీల విభాగంలో వీ ఈశ్వరిసాయి ద్వితీయ స్థానం చేజిక్కించుకుంది. మొత్తంగా 8 విభాగాల్లో 6 పతకాలు సాధించి పోటీల్లో ప్రతిభ చాటారు. పోటీలకు కడప, విజయనగరం, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బాలికలు హాజరయ్యారు.

ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలి



చలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చకపోవడం దారుణమని ఫ్యాప్టో చైర్మన్ జీ.మోహన్ అన్నారు. సోమవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగ రోజుల్లో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల్లో చిరునవ్వులు లేకుండా కూటమి ప్రభుత్వం చేసిందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లపై అక్టోబర్ 7న విజయవాడలో తలపెట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎం .ఆదినారాయణ, నాయకులు గారపాటి ప్రకాష్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రవికుమార్, బి రెడ్డిదొర, కార్యదర్శి ఐ.రమేష్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వి మురళీకృష్ణ కే సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవి

- ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో 72, 73, 74 జీఓలు అమలు చేయాలి
- పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి.
- కేంద్రమే మెంబర్ 57ను అమలు పరుస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకి పాత పెన్షన్ అమలు పరచాలి. సీపీఎస్ రద్దు చేయాలి.
- ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలి
- 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి.
- రిటైర్డ్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వెంటనే గ్రాట్యూటీ కమిషన్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇతర బకాయిలు చెల్లించాలి
- సీఆర్‌పీల జీతాలు పెంచాలి
- ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్నీ కొనసాగించాలి.

చిత్రకారుడు వెంపటాపునకు రాష్ట్రస్థాయి బహుమతి



డాక్టర్ వెంపటాపు చిత్రీకరించిన చిత్రం



విజయవాడలో ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకుంటున్న డాక్టర్ వెంపటాపు

తణుకు అర్బన్: రాష్ట్రస్థాయి స్పాట్ పెయింటింగ్ పోటీల్లో తణుకుకు చెందిన చిత్రకారుడు డాక్టర్ వెంపటాపునకు ప్రథమ బహుమతి దక్కింది. ఈనెల 28వ తేదీన భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ వారి నిర్వహణలో వికసిత్ భారత్ కె రంగ్ కళా కె సంగ్ అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచినట్లు డాక్టర్ వెంపటాపు తెలిపారు. వికసిత్ భారత్ – 2047 అనే చిత్రాన్ని చిత్రీకరించి ఈ బహుమతి అందుకున్నట్లు వివరించారు. ఆదివారం సాయంత్రం విజయవాడలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కడపకు చెందిన ఫైన్ ఆర్ట్స్ యోగివేమన యూనివర్సిటి హెచ్‌ఓడీ డాక్టర్ కె.మృత్యుంజయరావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ సిరికొండ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సంతోష్ పెదగాడి, చిత్రకారుడు రమేష్ పెరపోగుల చేతులమీదుగా రూ. 5వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నట్లు చెప్పారు.

ఆక్వా లెక్క.. పక్కా

- ఆక్వాసాగులో రికార్డుల నిర్వహణ కీలకం
- ఆక్వా డైరీతో అనేక ప్రయోజనాలు
- ఉమ్మడి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు



చేపల చెరువుపై ఉత్పత్తులను రికార్డు చేస్తున్న దృశ్యం (ఫైల్)



చేపల పట్టుబడి (ఫైల్)

కైకలూరు: ఆదాయం, ఖర్చుల లెక్కలు పక్కాగా ఉంటేనే కుటుంబ జీవన బండి పట్టాలపై సవ్యంగా నడుస్తోంది. ఇదే సూత్రం ఆక్వారంగానికి వర్తిస్తోంది. చేపల, రొయ్యల సాగులో రికార్డు నిర్వహణ అనేది లాభదాయకత, వ్యాధి నివారణ, మార్కెట్ విశ్వసనీయతను నిర్ధారిస్తోంది. ఇది ఆక్వా సాగును శాస్త్రీయ పరంగా మెరుగుపర్చడంలో కీలకంగా మారుతోంది. ఆక్వా రైతులందరూ సాగు ప్రారంభం నుంచి ఉత్పత్తుల పట్టుబడుల వరకు ప్రతి అంశాన్ని నమూనా పుస్తకాల్లో రాయడం అలవాటు చేసుకోవాలని ఆక్వా నిపుణులు సూచిస్తున్నారు.

2.90 లక్షల ఎకరాల్లో సాగు

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాసాగు 5.75 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సింహభాగం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 2.90 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొత్తం సాగులో రొయ్యల సాగు 1.10 ఎకరాల్లో ఉంది. ఇక జిల్లాలో వార్షిక ఆక్వా ఉత్పత్తి 4 లక్షల టన్నులుగా ఉండగా, వార్షిక టర్నోవర్ రూ.18వేల కోట్లుగా నమోదవుతోంది. విదేశాలకు 3.5 లక్షల టన్నులను ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారు. కొందరు ఆక్వా రైతులు రికార్డుల నిర్వహణలో అశ్రద్ధ వల్ల ఉత్పత్తి, వ్యయాలను అంచనా వేయలేక నష్టాల బారిన పడుతున్నారు.

ఆక్వా సాగు రికార్డు వల్ల ఉపయోగాలివి

- పూర్వపు సాగులో నమోదు చేసిన చెరువు నీటి నాణ్యత, ఆహార వినియోగం వంటి వివరాలను గమనిస్తూ, ప్రస్తుత సాగులో వ్యాధులను నివారించవచ్చు.
- చెరువులో ఎంత విత్తనం. ఎంత ఆహారం ఉపయోగిస్తున్నామో చూసి, అవసరం లేని ఖర్చును తగ్గించడానికి ఉపయోగపడుతుంది.
- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణాల కోసం అవసరమైన సాక్ష్యంగా ఆక్వా సాగు రికార్డులను పరిగణలోకి తీసుకుంటారు.
- మార్కెట్‌లో విశ్వసనీయత పెంచుకోడానికి కొనుగోలు దారులకు నాణ్యమైన ఉత్పత్తిని అందిస్తున్నారని నిరూపించగలుగుతారు.
- ఎరువులు, ప్రోబయాటిక్స్ రసాయనాలు, మందుల వినియోగాన్ని గమనించి ఖర్చును తగ్గించవచ్చు.
- ప్రభుత్వ నిబంధనలు, ఆహార భద్రత, పర్యావరణ నియమాల నిబంధనలకు అనుగుణంగా ఉండటానికి రికార్డులు ఆధారంగా ఉంటాయి.
- విత్తనం, ఆహారం, శ్రమ, విద్యుత్, మందులు వంటి ఖర్చులు, అమ్మకాలు, ధరల లెక్కలు లాభం, నష్టాన్ని స్పష్టంగా చూపుతాయి. బడ్జెట్ తయారీకి ఉపయోగం.

ఇవి నమూనా రికార్డులు

ఆక్వా సాగులో ప్రధానంగా 8 రకాల రికార్డుల నిర్వహణ ఉంది. వీటిని సాగు రైతులు ఖచ్చితంగా పాటించాలని ఆక్వారంగ నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో చెరువుల తయారీ, స్టాకింగ్, మేత, నీటి గుణాలు, ఆరోగ్య స్థితి, పట్టుబడి–అమ్మకం, జమాఖర్చులు, ప్రతి పంటకు, చెరువుకు మొత్తం సారాంశం వంటి రికార్డులు ఉంటాయి. రికార్డు నమూనాల్లో తేదీ, చెరువు సంఖ్య, నీటి ఉష్ణోగ్రత, పీహెచ్, డీవో, సెలినిటీ, పారదర్శకత, సాగు చేస్తున్నా జాతీ, ఉత్పత్తి కిలోలు, అనుమానిత వ్యాధులు, కొనుగోలుదారు పేరు, విత్తనం కొనుగోలు చేసిన హేచరీ, ఉపయోగించిన మేత, అదాయం, ఖర్చు, లాభం వంటి విషయాలు పొందుపరుస్తారు. క్రమం తప్పకుండా వీటిని నమోదు చేస్తే అధిక ఉత్పత్తులతో పాటు భవిష్యత్తు సాగునకు దిక్సూచిగా ఉపయోగపడుతుంది.

రికార్డు నమోదు తప్పనిసరి



ఆక్వా సాగులో రికార్డు నమోదు సరైన యాజమాన్య పద్ధతుల్లో ఒకటి. అధిక శాతం ఆక్వా రైతులు గత సాగులో పెట్టుబడి, మేతల వినియోగం, వ్యాధుల తీవ్రత వంటి వివరాలు నమోదు చేయకపోవడంతో తర్వాత సాగులో నష్టపోతున్నారు. ప్రభుత్వ సబ్సిడీలకు సైతం పాత రికార్డులను పరిగణలోకి తీసుకుంటున్నారు. వ్యాధులను నియంత్రించడంలో పాత రికార్డులు కీలకంగా మారుతున్నాయి.

– డాక్టర్ పొన్నపల్లి రామమోహన్‌రావు, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

గూడెంలో విజృంభిస్తున్న జ్వరాలు

- ఆసుపత్రుల్లో అరకొర వైద్య సేవలు
- ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఫార్మాసిస్టుల కొరత


వెంకట్రామన్నగూడెంలో చికిత్స పొందుతున్న రోగి


ఏరియా ఆసుపత్రిలో రోగుల కిటకిట

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలో జ్వర దలరింపుతో ప్రజలు వణుకుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయడం లేదు. ఆసుపత్రులలో సౌకర్యాలు, జ్వర పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సోమవారం సాక్షి పరిశీలన చేసినప్పుడు నియోజకవర్గంలోని ఆసుపత్రులలో అనేక వాస్తవాలు బయటకు వచ్చాయి. సోమవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో అత్యవసర కేసులను మాత్రమే పీహెచ్‌సీలలో చూశారు. ఆసుపత్రులలో వచ్చే కేసుల్లో జ్వరాలు, టైఫాయిడ్ కేసులు కనిపించాయి. రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత ఉంది. కొన్ని పీహెచ్‌సీల్లో మందుల కొరత కూడా ఉంది.

ఏరియా ఆసుపత్రిలో జ్వరకేసులు అధికం

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో జ్వరాల కేసులు వారం రోజులుగా పదికి పైగా జ్వరం కేసులు నమోదయ్యాయి. గడచిన వారం రోజుల్లో సుమారు 1800మంది రోగులు రాగా, వారిలో ఆసుపత్రిలో 147 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. రోగుల రద్దీ అధికంగా ఉంది. రక్త పరీక్షలు చేసి పంపిస్తున్నారు.

యుహెచ్‌సీలలో ఎల్‌టీల కొరత

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు రెండు జ్వరం కేసులు వస్తున్నాయి. పట్టణంలోని నాలుగు ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉంది. వీకర్స్‌కాలనీ ఎల్‌టీ, మూడు రోజులు బేబే సెంటర్‌లో పనిచేస్తున్నారు. పట్టణంలోని ఎల్‌టీ ముదునూరు పీహెచ్‌సీలో మూడు రోజులు పని చేస్తున్నారు. యాగర్లపల్లి ఎల్‌టీ మాధవరం పీహెచ్‌సీలలో మూడు రోజులు డ్యూటీ చేస్తున్నారు. వెంకట్రామన్నగూడెం ఎల్‌టీ ఆకివీడులో మూడు రోజులు విధులు నిర్వర్తిస్తున్నారు. పెంటపాడు ఎల్‌టీ యండగండిలో మూడు రోజులు విధులకు వెళ్తున్నారు.

పీహెచ్‌సీల్లో ఫార్మాసిస్టుల కొరత

పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీలలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టుల కొరత ఉంది. టీబీ రోగులకు మందుల కొరత ఉంది. ముదునూరు పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంటు, ఎంపీహెచ్ ఈఓ, వీహెచ్‌సీ, స్టాఫ్‌నర్సు, పెంటపాడు పీహెచ్‌సీలో అటెండర్ కొరత ఉంది. గూడెం మండలంలోని మాధవరం పీహెచ్‌సీలో వారం రోజులుగా 3439 మంది రోగులు రాగా, వారిలో 48 మంది జ్వరంతో బాధపడుతున్నారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో వారం రోజులుగా ఓపి 633 ఉండగా, జ్వరాలు కేసులు 13 నమోదు కాగా, వాటిలో నాలుగు టైఫాయిడ్ కేసులున్నాయి. ఏరియా ఆసుపత్రులు, యుహెచ్‌సీ, పీహెచ్‌సీలలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాల్సి ఉంది. సీజనల్ జ్వరాలకు అనుగుణంగా అవసరమైన సిబ్బందిని నియమించాలని రోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి కొట్టు


ముత్యాలమ్మను దర్శించుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : దేవీ శరన్నవరాత్రాలను పురస్కరించుకొని మాజీ ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా ముత్యాలమ్మ వారిని, కడకట్లలోని బాలకనకదుర్గ అమ్మవారిని సోమవారం దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టుకు ఆలయ పూజారులు ముత్యాలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆయన వెంట సిర్రాపు శాంతకుమార్, చామన సూర్యచంద్రరావు, కట్టా నాగరాజు తదితరులు ఉన్నారు.

అప్పారావుపేటలో ఉచిత వైద్య శిబిరం


అప్పారావుపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం దృశ్యం

తాడపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్త్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాధవరం పీహెచ్‌సీ వైద్యురాలు సింధు మహిళలకు ఆరోగ్యపరీక్షలు చేశారు. అనంతరం క్యాన్సర్ లక్షణాలగురించి వివరించారు. ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు భరోసా జీఎస్టీ సంస్కరణలు


జీఎస్టీ సంస్కరణలు అమలు తీరు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): మహిళా సాధికారతకు భరోసా జీఎస్టీ సంస్కరణలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రోజు వారి ఉపయోగించే వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ సున్నా లేదా ఐదు శాతానికి తగ్గించిన నేపథ్యంలో (రెండు పన్నుల స్లాబ్సలతో) సోమవారం స్థానిక 20వ వార్డు సీతారాంపేటలోను, 2వ వార్డు నాన్న కల్యాణ మంపడంలో రేట్లు వ్యత్యాసాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, ఎంఈ వెంకటరమణ, కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు అవగాహన చేశారు. పాత రేట్లుకు, జీఎస్టీ తగ్గిన అనంతరం కొత్త రేట్లను పోల్చారు. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


స్వచ్ఛ ఉత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కమీషనర్ యేసుబాబు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్వచ్ఛ ఉత్సవ్, స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 35వ వార్డు నేతాజీ నగర్‌లోని పార్కులో సోమవారం స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. పార్కును క్లీనింగ్ చేశారు. బొలిశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్కుల పునరుద్దరణ, కాలువల పునరుద్దరణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. పార్కుల అభివృద్ధికి కమిటీలు ఏర్పాటు చేయాలని, వాటిని అభివృద్ధి చేయాలని తెలిపారు. మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, ఎంఈ వెంకటరమణ, ఉద్యోగు లు, స్థానిక ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: జేసీబీ యంత్రంలోని విడి పరికరాల చోరీపై సోమవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన గుంజ రాంబాబు తన జేసీబీ యంత్రంతో తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద జల్ జీవన్ మిషన్ పనులు చేస్తున్నాడు. అయితే, ఈ నెల 22వ తేదీన పని లేకపోవడంతో రాంబాబు యంత్రాన్ని అక్కడే వదిలి వెళ్లాడు. అనంతరం జేసీబీలోని కొన్ని విడి పరికరాలు లేకపోవడంతో తన బావమరిది, జేసీబీపై పనిచేసే ఉంగరాల చక్రి, నక్కా రాజేష్, కత్తుల ముఖర్ చోరీ చేశారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తండ్రి మందలించాడని కుమారుడు ఇంటి నుంచి పరారైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై బులిస్వామి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామానికి చెందిన పదిలం దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు తెలియకుండా తన యూనికార్న్ మోటారు సైకిల్‌ను విక్రయించాడు. దీంతో తండ్రి ఏడుకొండలు కుమారుడిని మందలించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదిన దుర్గాప్రసాద్ తన తండ్రి మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. అప్పట్నించి ఫోన్ స్విచాఫ్ వస్తుందని, స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ కానరాకపోవడంతో సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బులిస్వామి తెలిపారు.

ఎమ్మెల్సీ వంకకు కృతజ్ఞతలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఇసుక మాఫియాపై శాసన మండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను వైఎస్సార్‌సీపీ ఆచంట నియోజకవర్గ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో సుంకర సీతారామ్, కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, తప్పెట్ల వెంకట్రావు, దొమ్మేటి రాంబాబు, ముత్యాల నాగేశ్వరరావు, ఆర్ రంగారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, బొంతు శ్రీను, గుబ్బల రామకృష్ణ, కోట గిరిధర్‌లు పాల్గొన్నారు.

అదృశ్యం, చోరీ కేసుల్లో పురోగతి?

- సురేష్ అదృశ్యం కేసులో నిందితుల ఆచూకీ లభ్యమైనట్లుగా సమాచారం
- భారీ చోరీ కేసుల్లో తలమునకలవుతున్న పోలీసు యంత్రాంగం
- రెండు కేసుల్లోను బృందాలుగా వెతుకుతున్న నేర విభాగం సిబ్బంది



తణుకు పట్టణ పోలీస్ స్టేషన్

తణుకు అర్బన్: వరుస దొంగతనాలు, యువకుడు, న్యాయవాది అదృశ్యం తాలూకా కేసులతో తణుకులో పోలీసు వర్గాలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఒకవైపు తణుకు వారణాసి వారి వీధిలో 70 కాసుల బంగారు ఆభరణాలు భారీ చోరీ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించగా, తాడేపల్లిగూడెంకు చెందిన మడుగుల సురేష్ (29) అదృశ్యం అయ్యాడని ఈనెల 23వ తేదీన తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఎంతో కీలకంగా మారింది. సదరు కేసు వ్యవహారం పోలీసులకు పెనుసవాలుగా మారింది. ఇప్పటికే సురేష్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్న కోణంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు. అయితే అదృశ్యం వ్యవహారంలో అనుమానితులుగా ఉన్న యువకుల ఆచూకీ పోలీసులకు చిక్కినట్లుగా సమాచారం. రానున్న కొన్ని గంటల్లోనే అదృశ్యమైన సురేష్ వ్యవహారం బయటపెట్టే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. తన సోదరుడిని ఏమైనా చేసుంటారేమోనని ఫిర్యాదుచేసిన ప్రశాంతి, కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్దే పడిగాపులు పడుతూ యువకుడి ఆచూకీ దొరికిందా అని పోలీసులను పదేపదే అడుగుతున్నారు.

న్యాయవాది ఆచూకీ తెలియలేదు...

మరొకవైపు సురేష్ అదృశ్యానికి కారణమంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాది సత్యనారాయణరాజు అదృశ్యం వ్యవహారం కూడా కేసును మలుపుతిప్పుతోంది. ఇరువురి అదృశ్య వ్యవహారాల్లో ఇద్దరి కుటుంబ సభ్యులు తమ వారు కనిపించడంలేదంటూ ఫిర్యాదులు చేశారు. అయితే సురేష్ కేసు వ్యవహారంలో మాత్రం అతని సోదరి న్యాయవాది సత్యనారాయణరాజుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు కేసుల్లో ఎవరిని ఎవరు ఏం చేశారనే అనుమానాలు ప్రధానంగా చర్చనీయాంశంగా మారాయి.

బందోబస్తుకు పోలీసులు...

తణుకులో అదృశ్యం కేసులు, చోరీ వ్యవహారాల్లో తలమునకలవుతున్న పోలీసులు యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తుంది. పట్టణ ఇద్దరు ఎస్సైలు, సిబ్బంది విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బందోబస్తులో ఉండడంతో ఉన్న సర్కిల్ ఇనస్పెక్టర్‌తో పాటు సిబ్బంది ఈ కేసుల దర్యాప్తులో ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పట్టణ స్టేషన్‌లో ప్రస్తుతం ఉండాల్సిన సిబ్బందిలో సగంమంది కూడా లేకపోవడంతో ఉన్నవారితోనే కొందరు చోరీ కేసులోను, మిగిలిన వారు యువకుడు, న్యాయవాది అదృశ్యం కేసుల్లో తలమునకలువుతున్నారు. అయితే ఎట్టకేలకు యువకుడు సురేష్ తాలూకా వ్యవహారం మంగళవారానికి కొలిక్కిరానున్నట్లుగా సమాచారం. 70 కాసుల చోరీ వ్యవహారంలో ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగలా, స్థానికంగా ఉన్నవారేనా అనే కోణంలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నేర విభాగం సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. అయితే చోరీకి వచ్చిన వారు చదువుకున్న యువకులేనని బాధితవర్గాలు చెబుతున్నట్లుగా తెలుస్తోంది.

ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎస్సీ, ఎస్టీలకు కఠినమైన చట్టాలు అమలలో ఉన్నాయని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో విజిలెన్స్ అండ్ మోనటరింగ్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. మంగరాజు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు సమానమన్నారు. అగ్రవర్ణాలు ఉంటే ఎస్సీ, ఎస్టీలను అన్యాయంగా కించిపరిస్తే, అవహేళన చేసినా కఠినమైన చట్టాలు అమలు అవుతున్నట్లు చెప్పారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం, వివిధ శాఖల అధికారులు, చీకట్ల రజనీకాంత్, తాడేపల్లి చిరంజీవి కుమార్, వీఆర్ఓ, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, స్థానికులు పాల్గొన్నారు.

దుర్భరంగా చేనేత కార్మికుల పరిస్థితి


కరపత్రాలు పంచుతున్న సంఘ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న చేనేత వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అక్కింశెట్టి కోట నాగయ్య అన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో అక్టోబర్ 6, 7 తేదీల్లో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పాలకొల్లులో కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా కోట నాగయ్య మాట్లాడుతూ పవర్ లూమ్స్ అధికంగా రావడంతో చేనేత కార్మికులు చాలీచాలని వేతనాలతో బతకాల్సి వస్తోందన్నారు. ధర్మవరంలో అధునాతన యంత్రాల వల్ల చేనేత కుటుంబాలు పనులు కోల్పోయి ఆకలి చావులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి చేనేత కార్మికునికీ నేతన్న నేస్తం అమలు చేయాలని, చేనేత రంగ పరిరక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలుతోపాటు వాటిని ఉల్లంఘించిన పవర్‌లూమ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు యూనిఫామ్‌గా చేనేత వస్త్రాలను వాడాలని రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు చట్టం చేశారని, అయితే మిల్లు వస్త్రాలను యూనిఫాంగా ఇస్తూ చేనేత వస్త్రాలిచ్చినట్లుగా దొంగ రికార్డు రాసి రూ.వేల కోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

లోక పావని.. జగజ్జననీ


సరస్వతీమాతగా సర్వమంగళమ్మ


సరస్వతీమాతగా బలుసులమ్మ


సరస్వతీదేవిగా వాసవి అమ్మవారు


తణుకులో సరస్వతీదేవిగా వాసవీమాత


తణుకు సజ్జాపురం శివాలయంలో పూజలందుకున్న పార్వతీ దేవి


కాగులంపాడు రోడ్డులో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఎనిమిదో రోజైన సోమవారం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని సరస్వతి మాతగా విశేష అలంకరణ గావించారు. పిల్లలు, యువతీ యువకులు అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని సరస్వతి మాతగా విశేష అలంకరణ గావించారు. శంకరమఠంలోని సర్వమంగళమ్మను సరస్వతిమాతగా, మహంకాళమ్మ అమ్మవారిని సరస్వతిమాతగా విశేష అలంకరణ గావించారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

విశేష అలంకరణలో..

తణుకు అర్బన్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ప్రార్థనా మందిరంలో సోమవారం వాసవీ మాతను శ్రీ సరస్వతీ దేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, సభ్యుల ఆధ్వర్యంలో వాసవీ మాతను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సజ్జాపురంలోని శివాలయంలో పార్వతీ అమ్మవారిని దేవస్థాన కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాధికాలు జరిపారు. ఆలయ అర్చకులు గణపతి ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాడవాడలా విశేష పూజలు

పెంటపాడు: దసరా మహోత్సవాలు సందర్భంగా పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం మూలా నక్షత్రం పురస్కరించుకొని పలు ఆలయాలలో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పెంటపాడు మునినాని వారి వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఆలయం వద్ద గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మధు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సంఘ కార్యదర్శి రెడ్డి సూరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కర్రి వరహాలరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుధా శ్రీనివాసరెడ్డి, రెడ్డి శ్రీను, బండారు రాంబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలో ఈవో జవ్వాది కృష్ణ, కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పుస్తకాలు, పెన్నులతో సరస్వతిగా ప్రత్యేక అలంకరణ చేశారు. విప్పర్రు, కె.పెంటపాడు, కొండేపాడు, మీనవిల్లూరు, రామచంద్రపురం తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


పెంటపాడులో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి



పూజలలో పాల్గొన్న చిన్నారులు, యువతీ, యువకులు

యాంత్రీకరణ లాభదాయకం


కాంభొట్లపాలెంలో సేంద్రియ ఎరువులను డ్రోన్‌తో పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయ సాగులో యాంత్రీకరణ వల్ల మరింత లాభం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి జి.జ్యోతి అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కాంభొట్లపాలెం గ్రామంలో డ్రోన్‌లో సేంద్రియ ఎరువులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు వరి పొలాల్లో పొడ, ముడత తెగులు నివారణకు ట్రై కో డెర్మవిరిడీ, ఇస్సారియా, వెట్టిసెలియం కలిపి డ్రోన్‌తో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీ దుర్గ, రైతులు పాల్గొన్నారు.

వరల్డ్ హార్ట్ డే ర్యాలీ


వరల్డ్ హార్ట్ డే ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: గుండె జబ్బుల కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని డాక్టర్ వై.హృదయమోహన్ అన్నారు. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ నుంచి పూలపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అహ్మద్ నైముద్దీన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.